కోటలో మౌలిక వసతులు కరువు

- పార్కింగ్ స్థలంగా మారిన మినీ పార్కు
- అలంకార ప్రాయంగా మరుగుదొడ్లు
- అవస్థలు పడుతున్న మహిళలు

కోటలో తాళం వేసి ఉన్న మోడ్రన్ టాయిలెట్స్

పార్కింగ్ స్థలంగా మారిన మినీ పార్కు

ఖిలావరంగల్, ఫిబ్రవరి 9: చారిత్రక నేపథ్యం కలిగిన ఓరుగల్లు కోటలో పర్యాటకులకు మౌలిక వసతులు కరువయ్యాయి. కాకతీయుల పరిపాలన దక్షత, కీర్తి ప్రతిష్టలు, పౌరుషానికి నిలువెత్తు నిదర్శమైన ఖిల్లాలో అడుగడుగునా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. శతృదుర్భేధ్యమైన కోటలు, చారిత్రక కట్టడాలను వీక్షించడానికి వచ్చే పర్యాటకులను పట్టించుకునే నాథుడే కరువయ్యాడనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దూర ప్రాంతాల నుంచి వచ్చిన పర్యాటకుల కోసం మల, మూత్ర శాలలు ఏర్పాటు చేయడంలో పాలకులు పూర్తిగా విఫలమయ్యారనే విమర్శలు ఉన్నాయి. రెస్ట్ రూంలు లేకపోవడంతో బాలికలు, మహిళలు పడుతున్న అవస్థలు వర్ణాతీతం. కేంద్ర పురావస్తు శాఖ పరిధిలో, ఏకశిల చిల్డ్రన్స్ పార్కులో టాయిలెట్స్ ఉన్నా రూ. 20 టికెట్ కొంటేనే లోనికి అనుమతిస్తున్నారు. అయితే, అత్యవసర పరిస్థితుల్లో బాలికలు పడుతున్న బాధలు విచారకరణం.

మరుగుదొడ్లకు తాళాలు

కేంద్ర పురావస్తు శాఖ పరిధిలోని కీర్తితోరణాల ప్రాంగణంలో పర్యాటకులు, విద్యార్థులు తెచ్చుకున్న భోజనాలు చేయడాన్ని నిషేధించారు. దీంతో నాటి ప్రజాప్రతినిధులు, అధికారులు ఖుష్ మహాల్ మైదానం పక్కనే మినీ పార్కు చేశారు. భోజనాలు సిద్ధం చేసుకొని తినేందుకు వీలుగా వసతులు కల్పించారు. అయితే, ప్రస్తుతం ఆ పార్కును పార్కింగ్ స్థలంగా మార్చేశారు. అలాగే, అధికారులు సుమారు రూ. 10 లక్షలు వెచ్చించి పార్కింగ్ స్థలంలోనే మోడ్రన్ టాయిలెట్స్ నిర్మించి తాళం వేశారు. ఏళ్లు గడుస్తున్నా టాయిలెట్లను అందుబాటులోకి తీసుకురావడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పర్యాటకులు పార్కింగ్ స్థలం లేదా ఖుష్‌మహాల్ పక్కన ఉన్న మైదానంతోపాటు చెత్త డబ్బాల పరిసరాల్లో దుమ్మూ ధూళిలోనే భోజనాలు చేస్తున్నారు. అధికారులు స్పందించి కోటకు వస్తున్న పర్యాటకుల కోసం కనీస మౌలిక వసతులు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

బీసీ కులగణన తప్పుల తడక

ఖానాపురం, ఫిబ్రవరి 9: కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన బీసీ కులగణన సర్వే తప్పుల తడకగా ఉంది. 2014లో కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన సకల జనుల సర్వేలో బీసీలు 50 శాతం ఉంటే పదేళ్ల తర్వాత కాంగ్రెస్ చేపట్టిన సర్వేలో బీసీల శాతం ఎలా తగ్గుతుంది. వాస్తవానికి బీసీలు 50 శాతానికి మించి ఉన్నారు. సర్వే శాస్త్రీయంగా జరగలేదు. కాంగ్రెస్ స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి పొందడానికే తూతూ మంత్రంగా సర్వే చేపట్టింది. చట్టసభల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి. బీసీలంతా ఐక్యమై కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసాలను ఎండగట్టాలి.

– బత్తిని శ్రీనివాస్‌గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్

బీసీలను నిండా ముంచేందుకే కుల గణన

నర్సంపేట, ఫిబ్రవరి 9: బీసీలను నిండా ముంచేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం కుల గణనను చేపట్టింది. బీసీలకు అన్యాయం చేయాలని చూస్తున్న ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారు. వాస్తవాలను పక్కనబెట్టి కాంగ్రెస్ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నది. అసెంబ్లీ సాక్షిగా సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు బీసీల కుల గణన విషయంలో చెప్పినవన్నీ అబద్ధాలే. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కేటాయించిన తర్వాతే ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలకు ముందుకెళ్లాలి. కాంగ్రెస్ బీసీలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలి.

– నామాల సత్యనారాయణ, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు

శ్రీనివాస్‌ను అభినందిస్తున్న ఏసీపీ నందిరాంనాయక్

హెడ్‌కానిస్టేబుల్‌కు ఏసీపీ అభినందనలు

వరంగల్‌చౌరస్తా, ఫిబ్రవరి 9: నేరం చేసిన వాడికి శిక్షపడే వరకూ అలుపెరగని పోలీస్ స్ఫూర్తిని ప్రదర్శించిన హెడ్ కానిస్టేబుల్‌ను వరంగల్ ఏసీపీ నందిరాం నాయక్ అభినందించారు. పోచమ్మమైదాన్‌లోని శివసాయి ఆలయంలో 2018 అక్టోబర్ 26న పూజారి దేవళ్ల సత్యనారాయణశర్మ హత్యకు గురయ్యాడు. ప్రధాన నిందితుడిగా ఉన్న సాదిక్ హుస్సేన్‌కు జీవిత ఖైదు పడేందుకు కీలకంగా వ్యవహరించిన దాడి శ్రీనివాస్‌ను ఆదివారం ఏసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నందిరాంనాయక్ సన్మానించారు. విధుల్లో అంకితభావం ప్రదర్శించి, 30 మంది ప్రత్యేక్ష సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టి నిందితుడికి శిక్షపడేలా చేసిన పోలీసుల కృషిని ఆయన కొనియాడారు. ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని సూచించారు. మట్టెవాడ సీఐ గోపి, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు పక్కనే ప్రమాదకరంగా ఉన్న గేట్‌వాల్వ్

ప్రమాదకరంగా గేట్‌వాల్వ్

నర్సంపేట, ఫిబ్రవరి 9: పట్టణంలోని నర్సంపేట–మల్లంపల్లి 365 జాతీయ రహదారిపై మిషన్ భగీరథ పైపులైన్ గేట్‌వాల్వ్ ప్రమాదకరంగా మారింది. గేట్ వాల్వ్ ముందు, చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డుపై గేట్‌వాల్వ్ ఏర్పాటు చేయడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సెల్‌ఫోన్లలో చార్జింగ్ లేదట!

విద్యుత్ అధికారుల వింత సమాధానం

కరీమాబాద్, ఫిబ్రవరి 9: విద్యుత్ సరఫరా నిలిచి పోయినప్పుడు అధికారులకు ఫోన్ చేస్తే స్విచ్చాఫ్ వస్తున్నదని వినినియోగదారులు వాపోతున్నారు. కార్యాలయంలో నిరంతరం ప్రజలు చేసే కాల్స్‌ను రిసీవ్ చేసుకొని సమాధానం చెప్పాల్సి ఉంది. కానీ, సరఫరా నిలిచిపోయిన సమయంలో అధికారుల మొబైళ్లు పని చేయడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఫోన్లు ఎందుకు పని చేయడం లేదని సిబ్బందిని వివరణ కోరగా.. సెల్‌ఫోన్లలో చార్జింగ్ అయిపోందని చెప్పడం కొసమెరుపు. ప్రజలకు విద్యుత్ సరఫరా చేసే కార్యాలయంలో సెల్‌ఫోన్లలో చార్జింగ్ లేదనడం విడ్డూరంగా ఉందని ప్రజలు వాపోతున్నారు. సరఫరా నిలిచిన సమయంలో వినియోగదారులు ఫోన్ చేస్తే సమాధానం ఇచ్చేలా చూడాలని ప్రజలు ఉన్నతాధికారులను కోరుతున్నారు.

పట్టా అందుకుంటున్న మర్రి శ్రీనివాస్

సీఏ పూర్తి చేసిన రాయపర్తి యువకుడు

రాయపర్తి, ఫిబ్రవరి 9: మండలకేంద్రానికి చెందిన మర్రి శ్రీనివాస్ చార్టెడ్ అకౌంటెంట్ విద్యాభ్యాసం పూర్తి చేసి శనివారం సీఏ కాన్వోకేషన్ పట్టా అందుకున్నాడు. మండలకేంద్రంలోని యాదవ కాలనీకి చెందిన రైతులు మర్రి లక్ష్మి–వెంకటేశం యాదవ్ దంపతుల కుమారుడు శ్రీనివాస్ హైదరాబాద్‌లో నాలుగేళ్ల సీఏ కోర్సు పూర్తి చేశాడు. అనంతరం పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాడు. ఈ మేరకు హైదరాబాద్‌లోని గచ్చిబౌళి స్టేడియంలో ఇన్‌స్టిట్యూట్ సారథ్యంలో జరిగిన పట్టాల ప్రదానోత్సవంలో శ్రీనివాస్ కాన్వోకేషన్ పట్టా అందుకున్నాడు.

స్వాములోరి ఉత్సవాలు ప్రారంభం

హనుమత్ వాహన సేవ, గరుడ వాహన సేవలు నిర్వహిస్తున్న వేదపండితులు

రాయపర్తి, ఫిబ్రవరి 9: కోరిన కోర్కె లు తీర్చే కోనేటి రాయుడు, నమ్మి కొలిచిన వారికి కొంగు బంగారంగా నిలుస్తాడు, పిలిస్తే పలికే దైవంగా భక్తుల హృదయా ల్లో బలీయమైన స్థానాన్ని పదిలపర్చుకున్న మండలంలోని వెంకటేశ్వరపల్లిలో స్వయం వ్యక్త శ్రీవేంకటేశ్వరస్వామి(సన్నూరు) వార్షిక అధ్యయన బ్రహ్మోత్సవాలు అత్యంత భక్తిప్రపత్తుల నడుమ ప్రారంభమయ్యాయి. ఆదివారం ఆలయ అనువంశిక ధర్మకర్తల మండలి, ఆలయ ఈవో కలకోట్ల వేణుగోపాలాచార్యులు, ఆలయ అనువంశిక పూజారులు ఆరుట్ల రంగాచార్యులు, వెంకట రామకృష్ణమాచార్యులు, వెంకట రమణాచార్యులు సారథ్యంలో హనుమత్ వాహన సేవ, నమ్మాళ్వార్‌కు స్నపన తిరుమంజసం, గరుడ వాహన సేవలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గోవింద నామస్మరణతో పల్లెలన్నీ మార్మోగాయి.

రైల్వేస్టేషన్‌లో 15.6 కిలోల గంజాయి పట్టివేత

వివరాలు వెల్లడిస్తున్న సీఐ సురేందర్

ఖిలావరంగల్, ఫిబ్రవరి 9: వరంగల్ రైల్వేస్టేషన్‌లో ఆర్పీఎఫ్ పోలీసులు ఆదివారం గంజాయి తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని అతడి వద్ద ఉన్న 15.631 కిలోల గంజాయిని పట్టుకున్నారు. ఈ మేరకు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వరంగల్ జీఆర్పీ సీఐ పీ సురేందర్ వివరాలు వెల్లడించారు. వరంగల్ ఆర్పీఎఫ్ ఎస్సై వెంకటేశ్వర్లు, ఏఎస్సై వీ పీతాంబర్, హెడ్ కానిస్టేబుల్ రాజు ప్లాట్ నంబర్ 4లో తనిఖీలు చేశారు. ఒడిశా రాష్ట్రం భద్రక్ జిల్లా ముళ్లసాహి గ్రామానికి చెందిన సమన్ ఖాద్రీ(25) అనుమానాస్పదంగా కనిపించాడు. వెంటనే అతడి వద్ద ఉన్న బ్యాగ్‌లను తనిఖీ చేశారు. అందులో రూ. 3,90,775 విలువైన 15.631 కిలోల గంజాయి లభించడంతో స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితుడి అదుపులో తీసుకొని రైల్వే పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వెల్లడించారు.

బాధిత కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే పెద్ది పరామర్శ

నెక్కొండ, జనవరి 9: రెడ్లవాడకు చెందిన దగ్గు సతీశ్‌రావు ప్రమాదవశాత్తు మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆదివారం గ్రామానికి చేరుకొని సతీశ్‌రావు మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట నెక్కొండ, రెడ్లవాడ సొసైటీ చైర్మన్లు మారం రాము, జలగం సంపత్‌రావు, మాజీ సర్పంచ్‌లు సంతోష్, శ్రీలతా ప్రసాద్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు రాజిరెడ్డి, యూత్ మండల అధ్యక్షుడు వంశీకృష్ణ, నాయకులు శ్యామ్‌సుందర్, ఐలయ్య, మేకల వెంకటనారాయణ పాల్గొన్నారు.

బీసీలకు 56 శాతం సీట్లు కేటాయించాలి

- నిర్లక్ష్యం చేస్తే స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతాం
- తెలంగాణ బీసీ బహుజన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రతాపగిరి విజయ్‌కుమార్

సమావేశంలో మాట్లాడుతున్న విజయ్‌కుమార్

కాశీబుగ్గ, ఫిబ్రవరి 9: వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికంగా ఉన్న బీసీలకు అన్ని రాజకీయ పార్టీలు 56 శాతం సీట్లు కేటాయించాలని తెలంగాణ బీసీ బహుజన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రతాపగిరి విజయ్‌కుమార్ కోరారు. సంఘం జిల్లా అధ్యక్షుడు కటకం విజయ్‌కుమార్ అధ్యక్షతన ఆదివారం వరంగల్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలకు సముచిత స్థానం కల్పించిన వారికే ఎన్నికల్లో ప్రాధాన్యం ఇస్తామన్నారు. 56 శాతం ఉన్న బీసీలను కాంగ్రెస్ సర్కారు 46 శాతానికి తగ్గించి చూపించడం సరికాదన్నారు. ఎస్‌కేఎస్ సర్వే ద్వారా 56 శాతం బీసీలు ఉన్నట్లు వెల్లడైందన్నారు. పూర్తి సర్వే నిర్వహించిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కామారెడ్డి సభలో ఇచ్చిన బీసీ డిక్లరేషన్ హామీని సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే అమలు చేయాలన్నారు. బీసీలను నిర్లక్ష్యం చేస్తే వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెబుతామని హెచ్చరించారు. సమావేశంలో తెలంగాణ కుమ్మర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆకారపు మోహన్, వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పల్లపు సమ్మయ్య, రజక సంఘం అధ్యక్షుడు రాష్ట్ర నూతనకంటి ఆనందం, ఆరేకటిక రాష్ట్ర నాయకుడు గోగికార్ క్రాంతికుమార్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

రాయపర్తి/నర్సంపేట, ఫిబ్రవరి 9: రాయపర్తి మండలంలో పలు బాధిత కుటుంబాలకు బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి ఎస్‌ఆర్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఆర్థిక సాయం అందించారు. తిర్మలాయపల్లిలో ఇటీవల మృతి చెందిన మాత్యచ నర్సయ్య కుటుంబానికి నిత్యావసరాలు అందించారు. కొత్తూరు పరిధి గుంటూరుపల్లికి చెందిన సీనియర్ రాజకీయ నాయకుడు పాతూరి శివరామయ్య ఆదివారం మృతి చెందగా, బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. గణేశ్‌కుంటలో హనుమాన్ ఆలయ అభివృద్ధికి సహకారం అందిస్తానని శ్రీనివాస్‌రెడ్డి హామీ ఇచ్చారు. కార్యక్రమాల్లో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మునావత్ నర్సింహానాయక్, మండల నాయకులు జినుగు అనిమిరెడ్డి, రంగు కుమార్, పూస మధు, లేతాకుల రంగారెడ్డి, మధుకర్‌రెడ్డి, భూక్యా సురేందర్ రాథోడ్, గారె నర్సయ్య, సంది దేవేందర్‌రెడ్డి, గజవెల్లి ప్రసాద్, అయిత రాంచందర్, చందు రామ్‌యాదవ్, తాళ్లపల్లి సంతోష్‌గౌడ్, కోల సంపత్, ఎల్లస్వామి, రవినాయక్, మహేశ్, శ్రీధర్, పాలెపు శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు. నర్సంపేట మండలంలోని గురిజాలలో సున్నపు సాంబరాణి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు చిన్నపెల్లి నర్సింగం, క్లస్టర్ ఇన్‌చార్జి మోటూరి రవి, మాజీ ఎంపీటీసీలు గడ్డం కొమురయ్య, బండారు శ్రీలత–రమేశ్, పార్టీ మండల ఉపాధ్యక్షుడు అల్లి రవి ఆధ్వర్యంలో రూ. 5 వేల ఆర్థిక సాయం అందజేశారు. నాయకులు బండారి మల్లయ్య, బండారి చిన్న వెంకటేశ్వర్లు, దేవేందర్, గొడిశాల అశోక్, కొక్కు రాజమౌళి, కేరాజు, ఎడ్ల రవీందర్, సారంగపాణి, పత్రి కుమారస్వామి, నర్సింగం, రమేశ్, శ్రీకాంత్, ప్రకాశ్ పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో గ్రీవెన్స్ రద్దు

ఖిలావరంగల్, ఫిబ్రవరి 9: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించనున్న గ్రీవెన్స్ సెల్‌ను రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ సత్యశారద ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్, ఖమ్మం, నల్లగొండ నియోజకవర్గం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంతోపాటు పరిపాలనా పరమైన కారణాల వల్ల ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. నేడు కలెక్టరేట్‌కు ఫిర్యాదుదారులు రావొద్దని కోరారు.

నేడు బల్దియా కార్యాలయంలో గ్రీవెన్స్

వరంగల్, ఫిబ్రవరి 9: వరంగల్‌లోని కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ నిర్వహించనున్నట్లు కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరిస్తామని పేర్కొన్నారు. స్థానిక సమస్యల పరిష్కారం కోసం ప్రజలు గ్రీవెన్స్‌లో వినతులు అందజేయాలని కోరారు.

మాట్లాడుతున్న అనిల్‌కుమార్

రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలి

వరంగల్‌చౌరస్తా, ఫిబ్రవరి 9: రాజ్యాంగాన్ని పరిరక్షించుకునేందుకు దళితులు ముందు వరుసలో ఉండాలని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్‌కుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం తమ్మెర భవన్‌లో ఏర్పాటు చేసిన దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాజ్యాంగాన్ని మార్చేందుకు జరుగుతున్న కుట్రలను తిప్పికొట్టాలని కోరారు. అట్రాసిటీ కేసుల విషయంలో సుప్రీంకోర్టు షరతులు విధించడం బాధాకరమన్నారు. సమావేశంలో జిల్లా కమిటీ అధ్యక్షుడు సంగి ఎలేందర్, సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి, జిల్లా ప్రధాన కార్యదర్శి జన్ను రవి, తాళ్లపల్లి జాన్‌పాల్, ఖిలా వరంగల్ మండల అధ్యక్షుడు జన్ను రాజు, వరంగల్ మండల కార్యదర్శి జన్ను శంకర్, గీసుకొండ మండలం అధ్యక్షుడు సిలివేరి రాజేశ్, మంద నవీన్, ఠాకూర్, సునీత, మేకల కుమారస్వామి, కోటి పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

jobs Apply Now!

★శ్రీ ఆర్ముఖ బార్ & రెస్టారెంట్ కరీమాబాద్ యందు పనిచేయుటకు వర్కర్లు వెంటనే కావలెను. సంప్రదించగలరు. సెల్ : 8019803598.

NTW-326593

BUILDING FOR SALE

★H.No: 2-6-75, Circuit House, Nakalgutta Hanamkonda, Ground floor Bldg, 160.7 Sq.yds, 1000 sqft RCC buildup area, East Facing, 1.15 Cr. Clear tittle, Brokers pls excuse. **Contact:** 9949912347, 999896 12347, 63025 53816.

NTW-332462

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

హైకోర్టు జడ్జి రాజేశ్వర్‌రావు

రిటైర్డ్ టీచర్‌కు పరామర్శ

కాశీబుగ్గ, ఫిబ్రవరి 9: వరంగల్ సొసైటీ కాలనీకి చెందిన రిటైర్డ్ టీచర్ చామర్తి శివరాం అనారోగ్యంతో బాధపడుతున్నాడు. శివరాం మేనల్లుడు, తెలంగాణ హైకోర్టు జడ్జి నామవరపు రాజేశ్వరరావు ఆదివారం కుటుంబ సమేతంగా వరంగల్‌కు వచ్చారు. ఈ సంద్భంగా శివరాంను పరామర్శించి యోగక్షేమాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో వరంగల్ తహసీల్దార్ ఎండీ ఇక్బాల్, ఇంతేజార్‌గంజ్ సీఐ సూక్రూ, ఎస్సై సందీప్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న శివానందగురు కల్చరల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్ట్ త్రిపురనేని గోపీచంద్, హోమంలో పాల్గొన్న కెప్టెన్ లక్ష్మీకాంతరావు దంపతులు

సనాతన ధర్మం మన సంప్రదాయానికి వెన్నెముక

కాశీబుగ్గ, ఫిబ్రవరి 9: హిందూ వివాహ వ్యవస్థ, భారతీయు సనాతన ధర్మం మన సంస్కృతీ సంప్రదాయాలకు వెన్నెముక వంటిదని పూజ గురుదేవులు శ్రీశివానంద మూర్తి చెప్పేవారని శివానందగురు కల్చరల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్ట్ త్రిపురనేని గోపీచంద్ అన్నారు. పైడిపల్లిలోని సప్తధామంలో హిందూ వివాహ వ్యవస్థ ప్రాధాన్యతా ప్రయోజనాలు అంశంపై ఆదివారం యువతకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక హోమం నిర్వహించారు. విదేశాల్లో సైతం హిందూ మతాన్ని ఇష్టపూర్వకంగా పెద్ద మొత్తంలో స్వీకరిస్తున్నారని వివరించారు. పూర్వకాలం నుంచి సృష్టి రహస్యం ప్రకారంగానే మన కుటుంబ వ్యవస్థ ఉందన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మాజీ రాజ్యసభ సభ్యుడు కెప్టెన్ లక్ష్మీకాంతరావు, ట్రస్టీ బండారు సాయినారాయణ, ఉపాధ్యాయులు నరసింహామూర్తి, వెంకటరమణ, రామన్న, సుదర్శన్, సుమతి, మాదారపు సదాశివుడు పాల్గొన్నారు.

వెంకటలక్ష్మికి నివాళులర్పిస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

సదానందం కుటుంబానికి పరామర్శ

గీసుగొండ, ఫిబ్రవరి 9: గ్రేటర్ వరంగల్ 15వ డివిజన్ మొగిలిచెర్లలో వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, బీఆర్‌ఎస్ నాయకుడు చింతం సదానందం కుటుంబాన్ని ఆదివారం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తీగల జీవన్‌గౌడ్‌తోపాటు ప్రధాన కార్యదర్శులు రమేశ్, గుడిమళ్ల రవికుమార్ పరామర్శించారు. ఈ సందర్భంగా సదానందం తల్లి వెంకటలక్ష్మి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో న్యాయవాదులు నాగరాజు, సాంబశివరావు, దామోదర్, సురేశ్, కృష్ణమూర్తి, శివరాజ్ పాల్గొన్నారు.

సేవాలాల్‌కు ధూపం ఇస్తున్న గిరిజన కులపెద్దలు

ఘనంగా సేవాలాల్ జయంతి

గీసుగొండ, ఫిబ్రవరి 9: గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ 286వ జయంతి వేడుకలను కొమ్మాల శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన వేషధారణతో చిన్నాపెద్ద తేడా లేకుండా భారీ ర్యాలీ నిర్వహించారు. తర్వాత గిరిజన కులపెద్దలు సేవాలాల్ మహారాజ్‌కు ధూపం(భోగ్ బండార్) సమర్పించారు. ముఖ్య అతిథిగా సీఐ బానోత్ కాశీరాం పాల్గొని సేవాలాల్‌కు నైవేద్యం సమర్పించారు. గిరిజనుల కోసం సేవాలాల్ తన జీవితాన్నే త్యాగం చేశారడని కొనియాడారు. మాజీ ప్రజాప్రతినిధులు వీరగోని రాజ్‌కుమార్, రడం భరత్, స్థానికులు రేవంత్, రాఘవేంద్ర, మర్రిరెడ్డి, వాగ్యానాయక్, రాజు, రాజశేఖర్, వీరన్న, భిక్షపతి, స్వామి, రవి, మోతీలాల్ పాల్గొన్నారు.

నేడు బీఆర్‌ఎస్ విస్తృత స్థాయి సమావేశం

రాయపర్తి, ఫిబ్రవరి 9: మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వెనకాల ఉన్న కుందూరు రాంచంద్రారెడ్డి వ్యవసాయ క్షేత్రంలో సోమవారం బీఆర్‌ఎస్ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు పార్టీ మండలాధ్యక్షుడు మునావత్ నర్సింహానాయక్ తెలిపారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ముఖ్య అతిథిగా హాజరు కానున్నారని, మండలంలోని 41 గ్రామ పంచాయతీల పరిధిలోని పార్టీ నాయకులు విధిగా హాజరు కావాలని కోరారు.

మన రహదారులు భద్రమేనా..?

- తరచూ జరిగే ప్రమాదాలపై ప్రజల అనుమానాలు
- వాహనదారులతోపాటు అధికారులూ బాధ్యులే..
- శాఖల మధ్య సమన్వయం లోపం

వరంగల్ నగరంలోని ఉర్సు బైపాస్ రోడ్డు

కరీమాబాద్, ఫిబ్రవరి 9: హైవేలపై రోడ్డు ప్రమాదాలు నిత్యకృత్యంగా మారిన ప్రస్తుత తరుణంలో మన రహదారులు భద్రమేనా అనే అనుమాలను ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు మాత్రమే హడావిడి చేసే అధికారులు.. ఆ తర్వాత అటువైపు కన్నెత్తి చూడడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల జరిగిన పలు ప్రమాదాల్లో వాహనదారుల తప్పిదాలు ఉన్నా.. రోడ్ల నిర్మాణంలో పలు శాఖల అధికారుల నిర్లక్ష్యం సైతం కనిపిస్తున్నదని ప్రజలు అంటున్నారు. అందుకు నిదర్శనం ఇటీవల జిల్లా ఉన్నతాధికారులతో జరిగిన సమావేశంలో అధికారుల భిన్న వాదనలే. రోడ్డు రవాణా శాఖ అధికారులు ఓ విధంగా.. నేషనల్ హైవే అధికారులు మరోలా ప్రమాదాలపై వెల్లడించినట్లు సమాచారం. పలు శాఖల మధ్య సమన్వయ లోపం ప్రజలకు శాపంగా మారిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రమాదాలు జరిగిన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలతోపాటు వాటికి గల కారణాలు తెలుసుకుని మరమ్మతులు చేయడంలో అధికారులు విఫలం అవుతున్నారనే వాదనలు ఉన్నాయి. దీంతోపాటు జిల్లావ్యాప్తంగా ఉన్న ప్రమాద స్థలాలను గుర్తించి, నివారణ చర్యలు చేపట్టడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అధికారులూ బాధ్యులే..

వరంగల్ నగరంతోపాటు మామునూరు, ఉర్సుగుట్ట బైపాస్ రోడ్డులో ఎక్కువగా ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఈ రహదారుల్లో ఇటీవల జరిగిన పలు ప్రమాదాలకు ఓ శాఖ అధికారులు డ్రైవర్ల నిర్లక్ష్యం కారణమని చెప్పగా.. మరో శాఖ అధికారులు రోడ్డు నిర్మాణం సరిగా లేకపోవడం కూడా ఓ కారణమని ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చారు. ఉర్సు బైపాస్ రోడ్డులో నిబంధనలకు విరుద్ధంగా మీడియన్ గ్యాప్‌లు ఉండడం వల్ల వాహనదారులు వేగం కట్టడి చేయలేకపోతున్నారని రవాణా శాఖ సిబ్బంది తెలిపారు. విద్యాలయాలు, పెట్రోల్ బంకులు, ఇంటర్నల్ రోడ్ల వద్ద నేరుగా గ్యాప్ ఇవ్వడం వల్ల అందులో నుంచి ఒక్కసారిగా వాహనాలు రోడ్డుపైకి రావడంతో వాహనాలు అదుపుతప్పుతున్నాయని తెలిపారు. ఆయా ప్రాంతాల నుంచి వచ్చే వాహనదారులు నేరుగా రోడ్డుపైకి రాకుండా ముందుకు వెళ్లి యూ టర్న్ తీసుకునేలా గ్యాప్‌లు ఉండాలని సూచిస్తున్నారు. దీనికితోడు మామునూరు రహదారిపై ఉన్న స్పీడ్ బ్రేకర్ల ఎత్తు ఎక్కువగా ఉండడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నాయని అధికారులు పేర్కొన్నారు.

ఆదివాసీల ఆరాధ్య దైవం కుమ్రంభీం

కుమ్రంభీం విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న దొంతి

నర్సంపేట, ఫిబ్రవరి 9: ఆదివాసీలు, గోండుల ఆరాధ్య దైవం కుమ్రంభీం అని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. మండలంలోని మాదన్నపేటలో దాసరిపల్లి డీఆర్‌ఆర్ ట్రస్టు వ్యవస్థాపకుడు దాసరి రాజిరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కుమ్రంభీం విగ్రహాన్ని ఆదివారం ఆయన ఆవిష్కరించారు. కుమ్రంభీం జల్ జంగిల్ జమీన్ అనే నినాదంతో ఆదివాసీ, గోండుల్లో చైతన్యం నింపి హక్కుల కోసం పోరాడారని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మణ్‌నాయక్, రామానంద్, రాజేందర్, గోపాల్‌నాయక్, ఆదివాసీలు పాల్గొన్నారు. అనంతరం దొంతి నర్సంపేటలో జరిగిన నియోజకవర్గ స్థాయి మార్షల్ ఆర్ట్స్ షాటో కాన్ కరాటే పోటీలను ప్రారంభించారు. ఆర్గనైజర్ రచ్చ శ్రీనివాస్, కరాటే మాస్టర్లు పాల్గొన్నారు.

టిప్పర్ బోల్తా.. తప్పిన ప్రమాదం


వరి పొలంలో బోల్తా పడిన టిప్పర్

ఖానాపురం, ఫిబ్రవరి 9: అదుపుతప్పి మట్టి లోడ్‌తో వెళ్తున్న టిప్పర్ బోల్తా పడిన ఘటన అశోక్‌నగర్ శివారులో ఆదివారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. నర్సంపేట మండలం రాజుపేట శివారు నుంచి అశోక్‌నగర్ మీదుగా నర్సంపేటకు నిత్యం టిప్పర్ల ద్వారా మట్టి తరలిస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం రాజుపేట శివారులో మట్టిని లోడ్ చేసుకొని నర్సంపేటకు బయల్దేరిన టిప్పర్ అశోక్‌నగర్ శివారులోకి చేరుకోగానే అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. టిప్పర్ అయోధ్యనగర్‌కు చెందిన రైతు కూస స్వామి వ్యవసాయ పొలంలో పడడంతో కొంత మేర పంట దెబ్బతిన్నదని వాపోయాడు.

వైరస్‌తో 4200 కోళ్లు మృతి

ఖానాపురం, ఫిబ్రవరి 9: మండలకేంద్రంలో తక్కళ్లపల్లి రమేశ్‌కు చెందిన కోళ్ల ఫాంలో వైరస్ సోకి ఆదివారం 4200 కోళ్లు మృత్యువాత పడ్డాయి. ఒక్కో కోడి 2 కిలోలకు పైగా బరువు ఉన్నట్లు బాధిత రైతు తెలిపాడు. చనిపోయిన కోళ్లను పూడ్చివేసినట్లు చెప్పాడు. లక్షల రూపాయల నష్టం జరిగిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరాడు.